ఇంటి నుంచే ఓటేయొచ్చు

దివ్యాంగులు, వయోవృద్ధులకు అవకాశం

- నియోజకవర్గంలో 7,965 మంది
- వినియోగించుకోండి : తహసీల్దార్



నల్లబెల్లిలో వృద్ధురాలికి ఫారం అందజేస్తున్న తహసీల్దార్ రాజేశ్, అధికారులు

నల్లబెల్లి : వారు ఇంటి నుంచే ఓటేయొచ్చు. అందరూ కాదండోయ్.. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేసే స్థితిలో లేని 85 ఏళ్లకుపైబడ్డ, మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారు మాత్రమే. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో 7,965 మంది అందుకు అర్హులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏళ్లకుపైబడ్డ, మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి ఇంటి నుంచే ఓటేసే అవకాశం కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ క్రమంలో నియోజకవర్గ అధికారులు కార్యాచరణను వేగవంతం చేశారు. అర్హులను గుర్తించడంతోపాటు బూత్ లెవల్ అధికారి '12 డీ' ఫారాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఫారం పూర్తి చేసి బూత్ లెవల్ అధికారికి లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఏప్రిల్ 23లోగా దరఖాస్తు చేయాలి. అనంతరం ఎన్నికల అధికారి పరిశీలించి ఇంటి నుంచే అవకాశం కల్పిస్తారు. మండలంలో బూత్ లెవల్ అధికారులు అర్హులకు సదరు ఫారాలు అందజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 283 పోలింగ్ కేంద్రాలు..

నర్సంపేట నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో 1,14,358 మంది పురుష, 1,17,815 మంది మహిళా, ఆరుగురు ఇతర ఓటర్లు. కాగా 85 ఏళ్లకు పైబడిన వారు 1,890 మంది, దివ్యాంగులు 6,075 మంది.. మొత్తం 7,965 మంది ఓటర్లున్నారు. వీరందరికీ ఇంటి నుంచే ఓటేసే అవకాశం కల్పించేందుకు సంబంధిత అధికారులు ఫారాలు అందజేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేని స్థితిలో ఉన్న 85 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. అర్హులు ముందుగా '12 డీ' ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

-రాజేశ్, తహసీల్దార్, నల్లబెల్లి

కొనుగోళ్లను బాధ్యతగా నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ కౌసల్యదేవి

వరంగల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలు బాధ్యతగా నిర్వహించాలని కమిటీ సభ్యులను డీఆర్డీఓ కౌసల్యదేవి కోరారు. రాయపర్తి మండలంలోని 22 కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులతో డీఆర్డీఏ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెటింగ్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదుగురు కమిటీ సభ్యులు బాధ్యత వ్యవహరించాలని, ట్యాబ్‌లో నమోదు చేయడం, తేమ శాతం, గన్నీ సంచుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి పెట్టాలన్నారు. రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాళ్, ఏడీఆర్డీఓ, డీపీఎం, ఏపీఎలు, వివిధ గ్రామాలకు చెందిన కొనుగోలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వ హత్యలుగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అభివర్ణించారు. మండలంలోని ఆసరవెల్లికి చెందిన రైతు నూనావత్ నవీన్ ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి, విద్యుత్ సరఫరాలో మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో పంట దిగుబడి తగ్గి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తొలుత మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.25 వేల సాయం అందజేశారు. నవీన్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, అజ్మీర తిరుపతి, అజ్మీర బాసు, అజ్మీర వీరన్న, బాదావత్ బాలు, రాంచరణ్, కేలోత్ రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి ఆకాశ్‌ను, గైడ్ టీచర్ మమతను అభినందిస్తున్న హెచ్‌ఎం జయ, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి ఆకాశ్ రాష్ట్రస్థాయి నినాదాల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థి ఆకాశ్‌ను, గైడ్ టీచర్ వేముల మమతను హెచ్‌ఎం జయ, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో ఆకాశ్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటినట్లు తెలిపారు. విద్యార్థి రూ.4000 నగదు, ప్రశంస పత్రాలను అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, సంతోశ్‌కుమార్, బాలాజీ రావు, ఉదయ్‌కుమార్, సీహెచ్.మాధవి, సుందర్, కె.మాధవి, మురళి, రవీందర్, మోహన్ రావు, కృష్ణ, రమేష్, జాహేద్, ఇందిర పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ధర్నా



నర్సంపేట : దళిత సామాజికవర్గానికి చెందిన ధర్మారపు ప్రకాశ్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు ప్రకాశ్‌పై నర్సంపేటకు చెందిన వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ చితకబాదారని తెలిపారు. కాగా హనుమకొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రకాశ్‌ను ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్‌కుమార్, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వీరప్రకాశ్, అందె రవి, విద్యార్థి సంఘం నాయకుడు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే నేరాల నిర్మూలన



మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

దుగ్గొండి : ప్రజాచైతన్యంతోనే నేరాల నిర్మూలన సాధ్యమని సీఐ రాజగోపాల్ స్పష్టం చేశారు. మండలంలోని నాచినపల్లిలో గురువారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, తదితరాలపై పోలీస్ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో సమాజంలో సమస్యలూ పెరుగుతున్నాయని చెప్పారు. ప్రజలు సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అవగాహన పెంచుకుని పరిష్కారం సులువవుతుందని తెలిపారు. పిల్లలు సెల్‌ఫోన్ వినియోగిస్తున్న తీరుపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలని, లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మతవిద్వేశాలకు పాల్పడవద్దని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దని, వాహన చోదకులు తప్పనిసరగా హెల్మెట్ ధరించాలని, తదితర సూచనలు చేశారు. నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ కళాజాత ద్వారా ప్రదర్శనలు ఇస్తున్నట్టు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రజలు శాంతియుతంగా, అవగాహనతో ఎదుర్కోవాలని చెప్పారు. ప్రజలను స్నేహితుల్లా భావించాలని ఆకాంక్షించారు. సమసమాజ నిర్మాణంలో ప్రజాచైతన్యమే కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై జక్కుల పరమేశ్, కళాజాత బృందం సభ్యులు నాగమణి, రత్నాకర్, అశోక్, వీరస్వామి, నారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతే ధ్యేయం

- లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సర్ఫరొద్దీన్



ప్రొజెక్టర్ అందిస్తున్న సర్ఫరొద్దీన్, తదితరులు

సంగెం : పేద విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా కార్యక్రమాలు చేపడుతున్నట్టు హన్మకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సర్ఫరొద్దీన్ తెలిపారు. మండలంలోని కాపులకనపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు క్లబ్ ఆధ్వర్యంలో ఆయన లక్ష రూపాయల విలువైన ప్రొజెక్టర్‌ను బహూకరించారు. అనంతరం గ్రామంలోని ఉచిత శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లతోపాటు 11 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్ఫరొద్దీన్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే చదువుతారని, డిజిటల్ తరగతులతో వారికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. దృశ్య, శ్రవణ పద్ధతుల్లో బోధించడంతో పాఠ్యాంశం పూర్తిగా అవగతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రమేశ్, గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, పీడీజీ గోపాల్‌రెడ్డి, ఆర్‌సీకే సుబ్రాక్, నిర్మల, రాంచందర్‌రావు, శ్రీనివాస్ రావు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి డిజి స్కూల్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్

నర్సంపేట : పట్టణంలోని గీతాంజలి డీజీ స్కూల్‌లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్ ఇచ్చేలా ఈనెల 31న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష రాయడానికి విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ సుబ్బారావు తెలిపారు. రిజిస్ట్రేషన్, వివరాల కోసం సెల్ నంబర్ 7780121736, 7732071452ల్లో సంప్రదించాలని తెలిపారు.

టెట్ ఫీజు తగ్గించాలి

చెన్నారావుపేట : టెట్ ఆన్‌లైన్ ఫీజును తగ్గించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గతంలో ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.400 ఫీజు ఉండేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 పెంచడం సరికాదన్నారు. పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువతకు అశనిపాతంగా పరిణమించిన ఫీజును వెంటనే తగ్గించాలని, గతంలో మాదిరిగానే ఫీజు అమలు చేయాలని కోరారు.

అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు

వర్ధన్నపేట : అనధికార విద్యుత్ కోతలతో పట్టణ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజులుగా పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అసలే ఎండ కాలం. రోజురోజుకూ ఎండ పెరుగుతోంది. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో అనధికారికంగా కోత పెడుతూ వేదనకు గురి చేస్తున్నారంటూ ముస్లిం సోదరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేక నష్టపోతున్నామంటూ వాణిజ్య, వ్యాపార వర్గాలు తెలిపాయి. ఇక అన్ని వర్గాల ప్రజలకు ఉక్కపోత తప్పడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అనధికార కోతలు మానుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరూ తప్పనిసరిగా ఓటేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నర్సంపేట రూరల్ : అర్హులందరూ తప్పనిసరిగా ఓటేయాలని నోడల్ అధికారి కొర్ర సారయ్య, ఆదర్శ మండల సమాఖ్య ఏపీఎం మహేందర్ కోరారు. నర్సంపేట మండల ఆదర్శ సమాఖ్య కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన ర్యాలీను వారు ప్రారంభించి మాట్లాడారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతీఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా అర్హులందరూ నిజాయితీగా, తప్పనిసరిగా ఓటేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రోత్సవం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలోని నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తి అయిన తర్వాత ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మీ-నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు మాస కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ-రాణి, ఆత్మకూరు రాధాకృష్ణ-సుజాత, ప్రదీప్-అనూశ, సుధీర్-మమత దంపతులు, సురేందర్, చిట్టి, లక్ష్మి, విజయ, సంహిత కృష్ణ, ప్రతుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

దామెర: మండలంలోని ముస్త్యాలపల్లికి చెందిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌ను మాజీ సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్ గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రియాజ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని అన్నారు.

'ఇండియా కూటమి గెలుపే లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

దామెర : ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మండలంలోని ఓగ్లాపూర్‌లో గురువారం నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ఏటా రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి కేంద్రంలో గద్దెనెక్కి పదేళ్లుగా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడోతందని ధ్వజమెత్తారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. అలాగే ఇండియా కూటమి అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించేలా కృషి చేయాలని చెప్పారు. సమావేశానికి జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి అంబి సాంబయ్య, నాయకులు దండు భాస్కర్, ఎడ్ల మంజుల, అమ్మ సాంబయ్య, గంధం శోభ, జయ, శివ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్సై మున్నీరుల్లా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందినప్పటికీ అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సెల్ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత క్రమ శిక్షణతో ఎదగాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కితే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. ఒకవేళ మోసపోతే వెంటనే పోలీసులను సంప్రదించాలని చెప్పారు.

శ్రీకాంత్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్ : కేయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ పరిశోధకుడు శ్రీకాంత్ వల్లాలకు వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ బయోకంపోసిట్స్-ఏ కంపారేటివ్ స్టడీ' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగ ఆచార్యులు రాజనరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధన పూర్తిచేశారు. హనుమకొండ జిల్లా బీమారానికి చెందిన శ్రీకాంత్ ప్రస్తుతం వరంగల్ కిట్స్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పుట్టపాక రవి



నర్సంపేట రూరల్ : నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పుట్టపాక రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కొంగరి రాజు, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా బొట్ల పవన్, నాగుల రమేష్, కంసాని అశోక్, కోశాధికారిగా పానుగోటి అజయ్, ఈసీ సభ్యులుగా తిరుమల్ చౌహాన్, బొడ్డుపల్లి అజయ్, మాంకాళి ప్రభాకర్, నందగిరి రజనీకాంత్ తదితరులు ఎన్నికయ్యారు.

కొమ్మాల జాతర ఆదాయం రూ.7.24 లక్షలు



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం జాతర హుండీల లెక్కించగా రూ.7,24,393 ఆదాయం సమకూరింది. కొబ్బరికాయల విక్రయానికి రూ.63 వేలు, చిప్పలు పోగుకు రూ.1,04,116, పుట్నాలు, పేలాల అమ్మకానికి రూ.18,500 వేలం ద్వారా వచ్చినట్లు ఆలయ ఈఓ శేషగిరి తెలిపారు.

పంచాయతీ గదుల వేలం



పర్వతగిరి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీకి చెందిన గదులను దుకాణాల నిర్వహణ కోసం గురువారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ ఎం.శంకర్ వివరాలు వెల్లడించారు. మొత్తం 20 గదులకు గాను 12 గదులకు వేలం పూర్తైందని తెలిపారు. మిగితా 8 గదులకు ఈనెల 30న వేలం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

కొమురారెడ్డికి అభినందనల వెల్లువ



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చాడ కొమురారెడ్డి కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకులు గీసుకొండకు పెద్ద ఎత్తున తరలివచ్చి గురువారం ఆయనకు అభినందనలు తెలిపారు. హనుమకొండలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు పలువురు ముస్లిం నాయకులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కొమురారెడ్డి పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపురం : గూడూరు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టగా మండల కేంద్రానికి చెందిన సందీప్ నడిచి వెళ్తుండగా గురువారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్ కాలు విరిగింది. స్థానికులు ఆయన్ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

లారీ బోల్తా..

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట మూలమలుపు వద్ద నిమ్మకాయల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ ధ్వంసం అయినప్పటికీ క్యాబిన్ నుంచి డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి మార్కెట్ నుంచి గోరక్‌పూర్‌కు గురువారం నిమ్మకాయల లోడుతో వెళ్తున్న లారీ గురువారం ఉదయం 6గంటలకు వరంగల్ ఉర్సు గుట్ట మూల మలుపున డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడగా లారీ ధ్వంసమైంది. వెంటనే స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యకు సమాచారం అందజేసి ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా రోడ్డుపై పడిపోయిన నిమ్మకాయల బ్యాగులను మరో లారీలో లోడు చేసి జేసీబీ సాయంతో ధ్వంసమైన లారీని రోడ్డు పక్కకు జరిపారు. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఘటన వివరాలు సేకరించారు.